స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలి

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యేవరకు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలనీ తార్నాక డివిజన్ గౌడ సంఘం(కౌండిన్య) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యునైటెడ్ పూలే ఫ్రంట్ కోఆర్డీనేటర్ ఆలకుంట హరి,బిఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కూరెల్లి నాగరాజు గౌడ్‌ల ఆధ్వర్యంలో తార్నాక గౌడ సంఘం నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె కార్యాలయంలో కలిశారు. బీసి బిల్లు సాధన కోసం ఈ నెల జులై 17న తెలంగాణ జాగృతి,యుపిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమానికి తార్నాక గౌడ సంఘం సంపూర్ణ మద్దతు తెలిపారు.

ఉప్పలమ్మ దేవాలయం అభివృద్ధికి కృషి

లాలాపేట: గ్రామ దేవత ఉప్పలమ్మ దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని టీటీయుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తార్నాక డివిజన్ మాణికేశ్వర్ కమాన్ వద్ద ఉన్న ఉప్పలమ్మ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలుచేశారు. దీనికి శోభన్‌రెడ్డి హాజరై గ్రామదేవత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డెర బస్తీ ప్రజలందరిని చల్లంగా చూడాలనీ వేడుకున్నారు. కార్యక్రమంలో గుడి ఫౌండర్ గండికోట నరసింహ, బోదాస్ నరసింహ,వెంకటేష్, రాము తదితరులున్నారు.

విద్యార్థులకు స్టేషనరీ కిట్ల పంపిణీ

చిలకలగూడ : భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో మేడిబావి రెయిన్‌బో హోంలో గురువారం విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ చేశారు. రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్‌బాక్స్‌లు, చాక్లెట్స్, బిస్కట్లతో కూడిన స్టేషనరీ కిట్లను అందించినట్లు తెలిపారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే

రాంగోపాల్‌పేట్: యేసు క్రీస్తు శిష్యుల్లో ఒకరైన తోమా భారతదేశానికి వచ్చి మరణించిన దినాన్ని పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ క్రిస్టియన్ ప్రెస్‌క్లబ్‌లో ఇండియన్ క్రిస్టియన్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాలకు చెందిన జెరుసలేం మత్తయ్య, ఆనంద్, ఆండ్రూస్ జేవియర్, మోజెస్‌లు మాట్లాడుతూ కేరళకు వచ్చి పరిచర్య ప్రారంభించారని తెలిపారు. ఆంగ్లేయుల కాలంలో క్రైస్తవ మతం భారతదేశానికి వచ్చిందనే ఆరోపణలకు అర్థం లేదన్నారు. దీనికి చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయని తోమా నాడు కట్టించిన 7 చర్చిలు ఇప్పటికీ ఉన్నాయన్నారు. అందుకే ప్రభుత్వాలు ఇండియన్ క్రిస్టియన్ డేను అధికారికంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోమ్ చౌదరి, మెర్సీ, హరిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా మాందాల భాస్కర్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా మాందాల భాస్కర్‌ను సుమారు 13 మాల సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం ఓయూలో జరిగిన సమావేశంలో వివిధ అంశాల పై చర్చించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మాందాల భాస్కర్‌తో పాటు గ్రేటర్ ఛైర్మగా బేర బాల కిషన్ (బాలన్న), గౌరవ అధ్యక్షులుగా చెరుకు రామచందర్, చీఫ్ కోఆర్డినేటర్‌గా తాళ్లపల్లి రవి, కన్వీనర్‌గా నల్లల కనకరాజు, వర్కింగ్ ఛైర్మన్లుగా మంత్రి నరసింహయ్య, భీమ్ సేన ఎన్నుట్లు పేర్కొన్నారు.

క్రిష్ ఇన్ హోటల్ కిచెన్‌లో అగ్ని ప్రమాదం

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ క్రిష్ హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చిరు. వివరాల్లోకి వెళితే..ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఐదు అంతస్తుల భవనంలో క్రిష్ హోటల్‌తో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లో కాఫీ డే పేరుతో రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు.క్రిష్ హోటల్ కిచెన్‌లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దట్టమైన పొగలు రావడంతో హోటల్‌లో పనిచేసే నలుగురు సిబ్బందితో పాటు ఇద్దరు కష్టమర్లు కిందకు దిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వారు భవనం పైకి ఎక్కి ఆర్తనాదాలు చేశారు. మరో యువకుడు హోటల్ కిటికీ పగులగొట్టి కిందకు దూకేందుకు యత్నించగా చేతికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అప్పటికే అక్కడికి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది భవనంపై చిక్కుకున్న సిబ్బంది, కష్టమర్లను సురక్షితంగా కిందకు దింపారు. పొగ పీల్చుకుని ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు ఆక్సీజన్ అందజేసి వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

దోమలపై సమరం..

- ఒక రోజు ఒకే డివిజన్ విధానం అమలు..
- బేగంపేట సర్కిల్‌లో సత్ఫలితాలను ఇస్తున్న కొత్త విధానం..



సిబ్బంది మొత్తం ఒక రోజు ఒకే డివిజన్‌లో ఫాగింగ్ విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం..



సనత్‌నగర్: ఫాగింగ్ విధానంలో పాత విధానానికి స్వస్తి పలికి కొత్త విధానానికి తెరలేపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్‌లోని ఎంటామాలజీ విభాగంలో ఎంతమంది సిబ్బంది ఉంటే అంతమంది రోజుకో డివిజన్‌లో విధులు నిర్వర్తించి ఫాగింగ్ జరిగేలా చూస్తున్నారు. దీంతో సిబ్బంది మొత్తం ఒక రోజు డివిజన్ మొత్తంగా ఫాగింగ్ చేస్తుండడంతో కొంతమేర సత్ఫలితాలను ఇస్తోంది. దోమల నివారణ కోసం ప్రతియేటా జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న సంగతి తెలిసిందే. ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్, చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, దోమల వృద్ధి చెందకుండా గంబుషియా చేపల విడుదల వంటి ప్రక్రియలను నిర్వహిస్తూ వస్తున్నారు. అంతచేస్తున్నా పగలూ రాత్రీ తేడా లేకుండా దోమల స్వైరవిహారంతో అల్లాడిపోతున్నామని జనం ఎక్కడో చోట మొత్తుకుంటూ ఫిర్యాదులు రావడం చూస్తూనే ఉన్నాం. గతంలో ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించడంతో పాటు డివిజన్ వారీగా కేటాయించిన సిబ్బంది ఆ డివిజన్‌లో ఫాగింగ్ పూర్తి చేసేవరకు చాలా రోజుల సమయం పట్టేది. ఈ లోగా ఏదో ఒక మూల దోమలు వృద్ధి చెందుతూనే ఉండేవి. దీంతో ఫాగింగ్ చేస్తున్నప్పటికీ ఎంటమాలజీ సిబ్బంది లక్ష్యం నెరవేరే పరిస్థితులు ఉండేవి కావు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దోమల బెడదను అరికట్టేందుకు పకడ్బందీ ప్రణాళిక అమలుకు గత కొద్ది రోజుల క్రితం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్‌లో బన్సీలాల్ పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా నాలుగు డివిజన్లు ఉండగా రోజుకో డివిజన్‌లో సిబ్బంది మొత్తం విధుల్లో పాలుపంచుకుంటూ దోమలపై సమరం చేస్తున్నారు. నాలుగు రోజుల్లో నాలుగు డివిజన్లు పూర్తి చేసుకుని ఐదో రోజు మళ్లీ మొదటి రోజు నిర్వహించిన డివిజన్‌లో ఫాగింగ్ చర్యలు చేపడుతూ వస్తున్నారు.

- ప్రస్తుతం సర్కిల్‌లో పరిధిలో 15 మంది ఎంటమాలజీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఒక ఈఎఫ్ఏ (ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్)తో పాటు మరో 14 మంది కార్మికులు ఉన్నారు.
- ప్రస్తుతం 15 మంది సిబ్బందికి నాలుగు చిన్న మిషన్లు, రెండు పెద్ద మిషన్లు మొత్తం ఆరు మిషన్లు ఉన్నాయి. మరో రెండు యంత్రాలను సమకూరిస్తే మరింత పకడ్బందీగా ఫాగింగ్ చేయవచ్చని అభిప్రాయపడుతున్నారు.
- ఒక రోజు ఒకే డివిజన్‌లో ఫాగింగ్ విధానం అమలుచేయడంతో వచ్చిన ఫిర్యాదులు కూడా సత్వరమే పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది. నాలుగు డివిజన్‌లే ఉండడం వల్ల ఏదైనా డివిజన్ నుంచి ఫిర్యాదు అందితే మిగతా మూడు డివిజన్లు మూడు రోజుల్లో పూర్తి చేసుకుని నాలుగో డివిజన్‌లోకి వెళ్తున్నందున ఆ ఫిర్యాదును సత్వరమే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రతి ఇంటికి 15 రోజులకోసారి వెళ్లి రసాయన మందు పిచికారి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు.
- కొంతమంది కార్పొరేటర్లు ప్రతిరోజూ తమ డివిజన్‌లో అందుబాటులో ఉండాలని పట్టుబడుతున్నారు. అయితే జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను విజయవంతంగా ముందుకుతీసుకువెళ్తున్నారు.

విజయవంతంగా ఫాగింగ్ ప్రక్రియ కొనసాగుతోంది

జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక రోజు ఒకే డివిజన్‌లో సిబ్బంది మొత్తం ఫాగింగ్ విధులు నిర్వర్తిస్తూ ఆ డివిజన్‌లో అన్ని ప్రాంతాలను కవర్ చేస్తున్నాం. బేగంపేట సర్కిల్‌లో నాలుగు డివిజన్లు మాత్రమే ఉండడం వల్ల ఐదో రోజున మళ్లీ మొదటి రోజు నిర్వహించిన డివిజన్‌లో ఫాగింగ్ ప్రక్రియ జరుగుతుండడంతో ఈ లోపు దోమలు వృద్ధి చెందే అవకాశం చాలా తక్కువ.

– శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ, బేగంపేట సర్కిల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్ పోర్ట్, ప్రకాష్‌నగర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు పేస్ హాస్పటల్, గురుమూర్తిలేన్, మోతీలాల్ నెహ్రూనగర్, ఎయిర్‌కార్గో, శ్యామలకుంట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ ఎదురు లేన్, భగత్ సింగ్‌నగర్, సీపీడబ్ల్యుటీ క్వార్టర్స్, బృందావన్‌కాలనీ, ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, జెక్‌కాలనీ స్ట్రీట్‌నెంబర్-1, ఇంద్రప్రస్థా బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: కిమ్స్, జేమ్స్ స్ట్రీట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 4న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సబ్ డివిజన్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీవీ కాలనీ ఫీడర్ పరిధిలోని డీవీకాలనీ, జవహార్‌కాలనీ, గార్డెన్, డీవీ హౌజ్, రామాలయం,కిమ్స్ వెనుకవైపుప్రాంతాల్లో అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పీజీ రోడ్ ఫీడర్ పరిధిలోని వెస్లీ జూనియర్ కాలేజ్, పార్సీ కాంపౌండ్, కరీంకాంపౌండ్, నల్లగుట్ట ఎఫ్ క్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ అపోలో హస్పిటల్, విక్రంపురి 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ కే. మురళికృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విక్రంపురి, కార్ఖానా మేయిన్‌రోడ్, వాసవీ బి కాలనీ, పి అండ్‌టీ కాలనీ అదేవిధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు మడ్‌ఫోర్ట్ గన్‌రాక్ జనక్‌పురి కాలనీ, ఏపీ టెక్స్ట్‌బుక్స్ కాలనీ కార్ఖాన, అస్బెస్టాస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

బోనాల నిధులు స్వాహా చేసిన బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ నేతల ధ్వజం

బన్సీలాల్‌పేట్: ఆషాఢమాసం అమ్మవారి దేవాలయాలకు ప్రభుత్వం ఇచ్చే చెక్కుల సొమ్మును బీఆర్ఎస్ నాయకులు దోచుకుతిన్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం పద్మారావునగర్‌లో బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐ. చిరంజీవి విలేకరులతోమాట్లాడారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పద్మారావునగర్, ఐడిహెచ్ కాలనీ, బోయిగూడ, బన్సీలాల్‌పేట్ బీజేఆర్ తదితర ప్రాంతాల్లో దేవాలయాల బోనాల చెక్కులను బీఆర్ఎస్ నాయకులు కాజేశారని ఆరోపించారు. సుమారు 24 దేవాలయాల్లో బోనాల చెక్కుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని వాటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని విలేకరుల ముందు ప్రదర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అండదండలు ప్రోత్సాహంతో బీఆర్ఎస్ నాయకులు ప్రతి ఏటా బోనాల చెక్కులను తీసుకుంటున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా వారి పేరిట చెక్కులు తయారయ్యాయని వివరించారు. గుడి లేకున్నా ఒక్కో గుడి మీద పేర్లు మార్చి రెండు రెండు చెక్కులను ఈ విధంగా సుమారు రూ. 25లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాంతారావు, చంద్రశేఖర్, క్రిష్ణముదిరాజ్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షులు చిరంజీవి

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.35, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో ముందస్తు అరెస్టులు ?

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి నుంచి ఓయూ విద్యార్థి నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన సుమారు 15 మందిని అరెస్టు చేసినట్లు సమాచారం.

అలంకార ప్రాయంగా నూతన హాస్టల్ భవనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో రూ.40 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనం అలంకార ప్రాయంగా మారింది. నిర్మాణం పనులు పూర్తి చేసుకొని ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న భవనం పీజీ విద్యార్థుల కోసం నిర్మించారు. నూతన భవనం ప్రారంభమైతే సుమారు 500 మంది విద్యార్థులకు వసతి లభించనుంది.

గాంధీఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

గాంధీఆస్పత్రి: చికిత్స పొందుతున్న రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన పల్లె రోశయ్య (60) మద్యానికి బానిసయ్యాడు. లివర్ చెడిపోవడంతో అస్వస్థతకు గురై ఈనెల 1వ తేదిన గాంధీఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. భార్య సైదమ్మ రోగి సహాయకురాలిగా సపర్యలు చేస్తుంది. ఈనెల 2వ తేది రాత్రి బీడీలు తెమ్మని భార్యతో గొడవ పడడంతో తర్వాత తెస్తానని చెప్పింది. నిద్ర నుంచి లేచేసరికి బెడ్‌పై భర్త రోశయ్య కనిపించలేదు. పరిసర ప్రాంతాలతోపాటు స్వగ్రామంలో వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీహెచ్‌డీ ప్రవేశాలను పారదర్శకంగా చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ప్రవేశాలను పారదర్శకంగా చేపట్టాలని ఏబీవీపీ నాయకులు గురువారం ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని, పార్ట్ టైం పీహెచ్‌డీ అభ్యర్థుల నుంచి ఎన్‌ఓసీ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని, స్థానిక విద్యార్థులకు సీట్లు కేటాయించాలని, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేయాలని, గతంలో పెంచిన రూ.లక్ష పీహెచ్‌డీ ఫీజును తగ్గించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఏబీవీపీ నేత జీవన్ తెలిపారు.

రోశయ్య విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపడం హర్షణీయం

అమీర్‌పేట : ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపడంపై డాక్టర్ కొణిజేటి రోశయ్య మెమోరియల్ ఫోరమ్ హర్షం వ్యక్తం చేసింది. అమీర్‌పేటలోని రోశయ్య నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరమ్ సభ్యులు కామిశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడారు.గతంలో జరిగిన రోశయ్య వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా మాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రోశయ్య జయంతి జులై 4న అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కొణిజేటి రోశయ్య కుమారుడు శివసుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ కొణిజేటి రోశయ్య మెమోరియల్ ఫోరమ్ ప్రతినిధులు

అమీర్‌పేటలో హర్షాతిరేకాలు

సనత్‌నగర్: ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రిగా, పలు రాష్ట్రాల గవర్నర్‌గా ఉన్నత పదవులు అలకంరించిన కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అమీర్‌పేట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోశయ్య తుదిశ్వాస వరకు ఇక్కడే ఉన్నారు. ఆయన జయంతి జులై 4న (నేడు) రాష్ట్ర వేడుకగా జరపాలని ప్రభుత్వం ప్రత్యేక జీఓను కూడా విడుదల చేసింది. దీంతో దశాబ్దాల పాటు అమీర్‌పేటను అంటిపెట్టుకున్న ఉన్న రోశయ్య జయంతిని రాష్ట్ర వేడుకగా జరపాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ ప్రాంతం పులకించిపోయింది. గుంటూరు జిల్లా వేమూరు గ్రామంలో జన్మించిన రోశయ్య విద్యాభ్యాసం అంతా దాదాపుగా అక్కడే జరిగినప్పటికీ రాజకీయ జీవితంలో సింహభాగం అమీర్‌పేట చుట్టూనే తిరిగింది. రోశయ్య బల్కంపేట ఎల్లమ్మ తల్లికి భక్తుడు. తరచూ అమ్మవారిని దర్శించుకుండడంతో పాటు ఆలయ అభివృద్ధిలో భాగస్వామిగా నిలిచారనే చెప్పవచ్చు. ఎల్లమ్మ తల్లి చెంతనే నివాసం ఏర్పరచుకోవాలనే ఎల్లమ్మ దేవాలయానికి అతి సమీప ప్రాంతమైన అమీర్‌పేట ధరంకరం రోడ్డులో శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. ప్రభుత్వం తరుపున అధికారిక నివాసాలు కేటాయించినా ఏనాడూ వాటిని ఆశించకుండా ఇంటి నుంచే సచివాలయానికి రాకపోకలు సాగించేవారు.

రైల్వే ఉద్యోగుల కోసం ఆధార్ సర్వీస్ సెంటర్



ఆధార్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించిన సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జీఆర్ సుధీర్‌కుమార్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన రైల్వే ఉద్యోగుల కుటుంబాల కోసం సంచాలన్ భవన్‌లో గురువారం సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆధార్ సెంటర్‌ను సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జీఆర్ సుధీర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న సెంటర్ ద్వారా డివిజన్ పరిధిలోని రైల్వే ఉద్యోగులు తమ ఆధార్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కొత్త కార్డులు జారీ కోసం దరఖాస్తుల స్వీకరణ, చిరునామాల మార్పు తదితర సమస్యలకు సర్వీస్ సెంటర్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మొదటి రోజు 150 మంది రైల్వే కుటుంబాలకు చెందిన ఆధార్ సంబంధిత దరఖాస్తులు స్వీకరించినట్టు సెంటర్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు ధర్మేందర్, కే.శ్రావణ్‌కుమార్, పి.శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో సకాలంలో చికిత్స అందించాలి

సనత్‌నగర్: అనారోగ్యంతో బాధపడేవారు వైద్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 27 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.9.10 లక్షల విలువైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం పొంది వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

విగ్రహాల ఆవిష్కరణకు హాజరుకండి



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

సనత్‌నగర్: ఈ నెల 17న రాణిగంజ్ బస్‌డిపో ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణకు హాజరుకావాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ జోన్ గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నిరంజన్, జోనల్ సెక్రటరీలు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానం అందజేశారు. తన తండ్రి గుర్రం నర్సయ్యగౌడ్ రాణిగంజ్ డిపోలోనే ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేశారని, దాంతో తన తల్లిదండ్రులు నర్సయ్యగౌడ్, లక్ష్మీల జ్ఞాపకార్థం ఈ విగ్రహాలను తాను ఏర్పాటుచేస్తున్నట్లు పవన్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యేకు వివరించారు.

చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సనత్‌నగర్: చిన్నతనం నుంచి పర్యావరణ పరిక్షణపై అవగాహన కలిగించడం ద్వారా భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించిన వారమవుతామని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యుజీ ప్రసన్నకుమార్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన' అనే అంశంపై గురువారం సనత్‌నగర్‌లోని హిందూ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై చిత్రాలను గీసి ఆకట్టుకున్నారు. పాఠశాల చైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మిషనరీల పాత్ర ఎంతో కీలకం

రాంగోపాల్‌పేట్: భారతదేశంలో విద్య, వైద్యం, భాషాభివృద్ధి, సాహిత్యం కోసం క్రైస్తవ మిషనరీలో చేసిన సేవలు ఎనలేనివని కొల్హాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క్ పాలోనీస్ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని వైఎంసీఏలో ఇండియన్ క్రిష్టియన్ డే ఉత్సవాలను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతదేశానికి మొదటి శతాబ్దంలోని 52వ సంవత్సరంలో తోమా వచ్చి సువార్తతో పాటు అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, బిషప్ దయానంద్, బిషప్ సింగం, ఇండియన్ క్రిష్టియన్ డే సెలబ్రేషన్స్ నేషనల్ అంబాసిడర్ రెవరెండ్ శ్యామ్యుల్ దేవరాజ్ పెరుమాళ్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు రూ.50 లక్షల వసూలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల నుంచి రూ.50 లక్షలు వసులు చేసినట్లు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటర్వ్యూల దరఖాస్తులకు సైతం విద్యార్థుల నుంచి ఫీజులు వసులు దారుణమన్నారు. సైన్స్ కోర్సులకు రూ.500ల ఫీజును వసులు చేయగా ఇతర కోర్సులకు రూ.1500 వసులు చేశారని వివరించారు. ఎంట్రన్ టెస్ట్‌కు, ఇంటర్వ్యూలకు వేర్వేరుగా ఫీజులు ఉండవని, విద్యార్థుల నుంచి ఇంటర్వ్యూలకు వసూలు చేసిన అధిక ఫీజును తిరిగి చెల్లించాలని నెల్లి సత్య డిమాండ్ చేశారు.

ఓయూలో ముగిసిన జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.కాశీం అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.బాల క్రిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా 19 పరిశోధన పత్రాలను ప్రవేశపెట్టిన్నట్లు తెలిపారు. ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.